

# సకల జనులు మెచ్చిన మ్యానిఫెస్టో

**సీఎం కేసీఆర్ ఆదివారం ప్రకటించిన మ్యానిఫెస్టోపై వికారాబాద్ జిల్లాలోని అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభిస్తున్నది. ప్రజా సంక్షేమం విషయంలో ఏమాత్రం రాజీపడకుండా గతంలో అమలవుతున్న పథకాలను కొనసాగిస్తూనే ..మరికొన్ని కొత్త పథకాలను సీఎం ప్రకటించారు. ప్రతిపక్షాల ఊహలు..అంచనాలకు అందని విధంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకోవడమే లక్ష్యంగా మ్యానిఫెస్టోను ముఖ్యమంత్రి ప్రకటించారు. మ్యానిఫెస్టోలోని అంశాలు రైతులు, మహిళలు, వృద్ధులు, ఉద్యోగులు.. ఇలా సబ్బండ వర్ణాల వారిని ఆకట్టుకుంటున్నాయి.**

## మ్యానిఫెస్టో అద్భుతంగా ఉన్నది



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో అద్భుతంగా ఉన్నది. పేదలను ఆదుకునేందుకు అందులో అనేక సంక్షేమ పథకాలున్నాయి. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను రూపొందించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే వంట గ్యాస్ సిలిండర్‌ను రూ. 400లకే పంపిణీ చేయడం, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యాన్ని అందిస్తామని చెప్పడం చాలా సంతోషంగా ఉన్నది. అంతే కాకుండా రైతుబంధు సాయాన్ని దశలవారీగా రూ. 16వేల వరకు పెంచుతామని ప్రకటించడం అభినందనీయం.

– సత్తినేని సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ చౌడాపూర్ మండలాధ్యక్షుడు కులకచర్ల

## బీఆర్ఎస్‌తోనే రైతు రాజుగా మారుతాడు..

బీఆర్ఎస్ పార్టీతోనే రైతు రాజుగా మారుతాడు. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో ఏ పార్టీలు కూడా రైతుల కష్టాలను పట్టించుకోలేదు. పంట సాగు చేయాలంటే ఒకరిపై ఆధారపడాల్సిన పరిస్థితి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రైతుబంధు పథకాన్ని అమలు చేసి పంట పెట్టుబడికి ప్రతి ఏడాది ఎకరానికి రూ.10వేలు అందించి ఆదుకుంటున్నది. మరోసారి అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయాన్ని ఎకరాకు రూ.12వేల నుంచి 15వేల వరకు పెంచి అందిస్తామని మేనిఫెస్టోలో పేర్కొనడం హర్షనీయం. దీంతో తెలంగాణలోని ప్రతి గుంట కూడా సాగు భూమిగా మారుతుంది. - నారాయణరెడ్డి, రైతు, ధర్మాపూర్, అంగడిరైచూర్, కొడంగల్



## సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

తెల్ల రేషన్ కార్డులున్నా ప్రతి ఒక్కరికీ రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తామని సీఎం కేసీఆర్ తమ మేనిఫెస్టోలో ప్రకటించడం సంతోషకరం. దీని ద్వారా ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుంది. పేదల కష్టాలు ముఖ్యమంత్రికి తెలుసు. అందుకే ఆయన పేదల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకుని మేనిఫెస్టోను రూపొందించారు. ఇలాంటి సీఎంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం. -మాసని శ్రీనివాస్, గడిసింగాపూర్, పరిగి టౌన్



## నిరుపేదలకు వరంలాంటిది



ఆరోగ్యశ్రీ బీమాను రూ. 5లక్షల నుంచి రూ.15 లక్షల వరకు పెంచుతామని సీఎం కేసీఆర్ తమ మేనిఫెస్టోలో ప్రకటించడం నిరుపేదలకు వరం లాంటిది. ప్రస్తుతం వైద్య ఖర్చులు అధికం కావడంతో పేదల బాధలు తెలిసిన సీఎం కేసీఆర్ మంచి మనస్సుతో రూ. 15 లక్షల వరకు మళ్లీ అధికారంలోకి వస్తే పెంచుతామని చెప్పడం చాలా సంతోషించదగ్గ విషయం. -సాయిలు, పరిగి టౌన్

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడం ఖాయం..

పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తూ అండగా నిలుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఊహించని విధంగా బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోను సీఎం కేసీఆర్ ప్రకటించారు. పేదలు, మహిళలు, రైతులు తదితర రంగాల ప్రజలకు మేలు జరిగేలా మ్యానిఫెస్టో విడుదల చేయడం గొప్ప పరిణామం. ప్రతిపక్షాలు ఎన్ని జిమ్మిక్కులు చేసిన మూడోసారి గెలిచేది బీఆర్ఎస్ పార్టీయే. ముఖ్యమంత్రిగా కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారు.- స్వప్నారెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్, షాబాద్



## ఆరోగ్య శ్రీ బీమా రూ. 15 లక్షలకు పెంపు హర్షనీయం



ప్రతి పేద వాడికీ కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యం తో ఆరోగ్యశ్రీ బీమా గరిష్ఠ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.15 లక్షలకు రానున్న ఎన్నికల్లో గెలిచిన తర్వాత అమలు చేస్తామని సీఎం కేసీఆర్ తమ పార్టీ మ్యానిఫెస్టో లో ప్రకటించడం సంతోషకరం. గరిష్ఠ పరిమితిని పెంచడం ద్వారా పేదలకు ఎంతో మేలు జరుగుతుంది.

- లక్ష్మయ్యముదిరాజ్, దోమ రైతు బంధు మండల కోఆర్డినేటర్

## బీఆర్ఎస్ ఈజ్ ద బెస్ట్..

గడిచిన పదేండ్లలో సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారు. కాబట్టే ప్రజలు బీఆర్ఎస్ ఈజ్ ద బెస్ట్ అని కొనియాడుతున్నారు. అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా తెలంగాణలో పాలన సాగుతున్నది. బీఆర్ఎస్ విడుదల చేసిన మ్యాని ఫెస్టోలో అన్ని వర్గాల అభివృద్ధికి దోహదపడే పలు పథకాలను గెలిచిన తర్వాత అమలు చేస్తామని ప్రకటించడం సంతోషకరం. మరో మారు బీఆర్ఎస్‌కు మద్దతు పలుకుదాం.. తెలంగాణ అభ్యున్నతికి కృషి చేద్దాం.

-నవాజొద్దీన్,ముస్లిం మైనారిటీ నాయకుడు, కొడంగల్



## పేదలకు ఎంతో మేలు జరుగుతుంది



కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యులపై మోయలేని భారం వేస్తున్నది. ఈ భారం నుంచి తప్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే అర్హులైన పేద మహిళలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్‌ను అందిస్తామని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో పెట్టడం అభినందనీయం. దీంతో ఎంతో మంది పేదలకు మేలు జరుగుతుంది. సమాజం కోసం అహర్నిశలు పనిచేస్తున్న పాత్రికేయులకు కూడా రూ.400లకే సిలిండర్‌ను అందజేస్తామని ప్రకటించడం సంతోషకరం.

-విజయలక్ష్మి, తాండూరు

## సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాతే మహిళలకు మంచిరోజులు



మహిళల కష్టాలను తెలుసుకొని మా కోసం ఎన్నో పథకాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారు. గత ఉమ్మడి ప్రభుత్వాల పాలనలో తాగునీటి కోసం నానా తంటాలు పడ్డాం. కానీ.. కేసీఆర్ సీఎం అయిన తర్వాతే మాకు మంచి రోజులొచ్చాయి. ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీరు అందుతున్నది. ఆకాశానికి అంటిన గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించి మళ్లీ అధికారంలోకి వస్తే రూ.400 పంపిణీ చేస్తామని ప్రకటించడం చాలా సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ వస్తేనే మహిళలకు ఏ కష్టాలు రావు. ఇంటికి పెద్ద దిక్కుగా నిలుస్తున్నాడు. అన్ని వర్గాలను ఆదుకుంటున్నాడు.

-గొల్ల భారతమ్మ, హస్నాబాద్, కొడంగల్

## రైతుబంధు సాయం పెంపు హర్షనీయం



సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, పంట రుణాల మాఫీతో రైతులకు చాలా మేలు జరుగుతున్నది. ముఖ్యంగా 24 గంటల ఉచిత విద్యుత్తు సరఫరాతో పంటలను పండించుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ఇప్పటివరకు ఏడాదికి ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయాన్ని పంపిణీ చేస్తున్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే ప్రతి ఏటా ఎకరానికి రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఇస్తామని సీఎం కేసీఆర్ పార్టీ మేనిఫెస్టోలో పెట్టడం చాలా సంతోషకరం. దళితబంధును కూడా అర్హులందరికీ ఇస్తామని ప్రకటించడం అభినందనీయం. నిరుపేదలు, రైతుల పాలిట దేవుడిగా నిలిచిన కేసీఆర్ ముచ్చటగా మూడోసారి కూడా సీఎం కావడం ఖాయం.

-వెంకటప్ప, ఖాంజాపూర్, తాండూరు

## మహిళా సంక్షేమానికి పెద్దపీట



బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసింది. చాలా పథకాలను మహిళల పేరునే ప్రవేశపెట్టి అమలు చేస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టోలో అర్హులైన పేద మహిళలకు ప్రతినెలా రూ.3000 జీవన భృతిని అందిస్తామని ప్రకటించడం సంతోషకరం. ప్రభుత్వం ఒంటరి మహిళలకు కల్పిస్తున్న పలు పథకాలతో వారు ఇబ్బందుల్లేకుండా జీవిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేదోళ్ల కోసమే పని చేస్తున్నది. ఇలాంటి ప్రభుత్వమే మళ్లీ రావాలి.

-లక్ష్మి, తాండూరు

## ప్రతిపక్షాలకు దిమ్మతిరిగిపోతుంది

బీఆర్ఎస్ పార్టీ విడుదల చేసిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్షాలకు దిమ్మతిరిగిపోతుంది. గతంలో ప్రకటించిన మ్యానిఫెస్టోలోని ప్రతి ఒక్క అంశాన్ని సీఎం కేసీఆర్ అమలు చేయడంతోపాటు మరెన్నో పథకాలను అమలు చేసి ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యపరిచారు. ప్రజల కష్టాలు తెలిసిన మనసున్న ముఖ్యమంత్రి కాబట్టే ప్రతి వర్గానికీ ఆమోదయోగ్యమైన పథకాలు అందించి ఆదరిస్తున్నారు. మరోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల అభ్యున్నతి బంగారుమయంగా మారుతుంది.



-సాయిలు, చిన్ననందిగామ, కొడంగల్